JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 18-05-2026
Medchal - Malkajgiri । Monday 18-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 351
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 351 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com



మే 21 వ తేదీ ఉదయం 5.43 గంటలకు కంచి కామకోటి పీఠం స్వామి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ పుణ్య స్నానం ఆచరించి సరస్వతీ అంత్య పుష్కరాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈసారి దాదాపు 30 నుండి 40 లక్షల మంది ఈ అంత్య పుష్కరాలకు హాజరయ్యే అవకాశం ఉందని, వారికి ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా కాళేశ్వరం ఆలయంలో దర్శనాలు, పుష్కర స్నానాలకు వచ్చే వివిధ పీఠాధిపతులకు తగు ఏర్పాట్లు, పుష్కర ఘాట్ ల వద్ద పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

# సరస్వతీ నది పుణ్య స్నానాలు

- ఈనెల 21 వ తేదీ నుండి జూన్ 1 వరకు సరస్వతీ నదీ అంత్య పుష్కరాలు
- దాదాపు 40 లక్షల మంది హాజరవుతారని అంచనా
- మొదటి రోజు శ్రీ జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర
- సరస్వతీ స్వామి, రాష్ట్ర గవర్నర్ ల పుణ్య స్నానాలు
- సచివాలయంలో ఏర్పాట్లను సమీక్షించిన మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, సి.ఎస్ రామకృష్ణారావు

...మిగతాది 2 లో



## కూటమి పాలనకు రెండేళ్లు పూర్తి

- జూన్ 12వ తేదీతో మూడో ఏడాదిలోకి అడుగు..1.53 లక్షల మందికి శుభవార్త
- కొత్త వితంతు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయం

జయభేరి, విజయవాడ, మే 17 :

ఏపీలో టీడీపీ కూటమి పాలనకు రెండేళ్లు పూర్తి కావొస్తోంది. జూన్ 12వ తేదీతో కూటమి పార్టీలు అధికార పగ్గాలు చేపట్టి రెండేళ్లు పూర్తి అయ్యి.. మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. జూన్ 12వ కొత్త వితంతు పింఛన్లు జారీ చేయనున్నట్లు మంత్రి ఆదివారం ప్రకటించారు. నెలకు రూ.4 వేలు చొప్పున వీరికి అందించనున్నారు. కొత్త పింఛన్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత వితంతు పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించిన ఏపీ ప్రభుత్వం.. ఇందుకు ముహూర్తం ఫిక్స్ చేసింది. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జూన్ 12న వితంతు పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా

...మిగతాది 2 లో

- కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడు.. కేటీఆర్
- ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు




## బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి

జయభేరి, హైదరాబాద్, మే 17:

పోక్సో చట్టం కింద బండి భగీరథ్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్ బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ కేంద్రమంత్రి సంజయ్‌పై ఆయన నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారతదేశానికి కూడా అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్ర మంత్రి భయ భ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానీవ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించి.. ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా జరిపించాలని కేంద్రానికి ఆయన స్పష్టం చేశారు. కేంద్రమంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా.. ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా కొట్లాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు.




2 లో

## ఎవరెవరినో ఎన్‌కౌంటర్ చేశారు

- బండి భగీరథ్‌ను పట్టుకోవడం చేతకాలేదా.. సీపీఐ నారాయణ ఫైర్
- అలా అరెస్ట్ చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పు చేసిందని నారాయణ తీవ్ర విమర్శలు
- బండి భగీరథ్‌ను వెతకడానికి 10 టీమ్‌లను పంపించామని పోలీసులు చెప్పారని.. అయితే ఆ పది బృందాలు ఏం చేశాయి

జయభేరి, హైదరాబాద్ :

బండి భగీరథ్ పోక్సో కేసు విషయంలో సీపీఐ నారాయణ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు న్యాయవ్యవస్థలో కూడా అసమర్థత కనిపించిందని సంచలన ఆరోపణలు గుప్పించారు. పోక్సో కేసు నమోదైన వెంటనే బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తప్పు చేసిందని పేర్కొన్నారు. ఇక ఎవరెవరినో ఎన్‌కౌంటర్ చేశారు గానీ.. బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయలేకపోయారంటూ పోలీసులపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారిన బండి భగీరథ్ కేసులో వైఫల్యాలు స్పష్టంగా ఉన్నాయని.. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. బండి భగీరథ్‌పై బాధితులు ఫిర్యాదు చేసి, కేసు పెట్టిన వెంటనే అతడిని అరెస్ట్ చేసి ఉంటే.. ఇంత గొడవ జరిగేది కాదని పేర్కొన్నారు.



## కరోనా కంటే డేంజరస్ వైరస్..

- హడలెత్తిస్తున్న ఎబోలా..
- గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన WHO

జయభేరి, న్యూఢిల్లీ:

సముద్రంలో ఓ షిప్‌ని గిరాటేసి హంటా వైరస్ వెంటాడుతుంటే.. ఇంకోవైపు ఆఫ్రికా దేశాన్ని ఎబోలా షేక్ చేస్తోంది. ప్రాణాంతక వైరస్ జెట్‌స్పీడ్‌తో విస్తరిస్తోంది. ఇప్పటికే ఆ వైరస్ బారిన పడి 88 మంది చనిపోయారు.. 336మందికి వైరస్ సోకిందని సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకటించింది. తక్కువ సమయంలో ఎక్కువ మరణాలు, కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో.. ఉగాండాలో ఎబోలా వైరస్ అంతకంతకు విస్తరిస్తోంది. వైరస్ ఏకంగా రెండు ఆఫ్రికన్ రాజధానులకు చేరడం.. పైగా ఈ వైరస్‌కి ఎలాంటి చికిత్స లేకపోవడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ.. గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీని జారీచేసింది. సరిహద్దులు దాటి వైరస్ వ్యాపించడం.. మరణాల వెనుక స్పష్టమైన కారణాలు తెలియకపోవడం.. అధికారిక గణాంకాల కంటే వాస్తవంగా వైరస్ తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో WHO ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వైరస్.. అరుదైన బుందిబుగ్యో ఎబోలా వైరస్ రకానికి చెందింది. మానవ చరిత్రలో ఈ స్ట్రెయిన్ కారణంగా 2007లో ఉగాండా.. 2012లో తూర్పుకాంగోలో అంటువ్యాధులు వచ్చాయి.



2 లో




2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఎవరెవరినో ఎన్‌కౌంటర్ చేశారు

అలా అరెస్ట్ చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తప్పు చేసిందని నారాయణ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇక ఈ కేసులో పోలీసుల వ్యవహార శైలి కూడా అనేక అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశామని ఒక పక్క పోలీసులు చెబుతున్నారని.. కానీ మరోవైపు.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాత్రం.. చట్టంపై నమ్మకంతోనే తన కుమారుడిని తానే పోలీసులకు అప్పగించినట్లు పేర్కొంటున్నారని నారాయణ గుర్తు చేశారు. ఈ బండి భగీరథ్ అరెస్ట్ విషయంలో అనుమానాలు తలెత్తుతున్నాయని తెలిపారు.
బండి సంజయ్ చెబుతున్నది వింటే.. పోలీస్ వ్యవస్థ ప్రశ్నార్థకమైందని విమర్శించారు. ఈ కేసులో న్యాయవ్యవస్థ అసమర్థత కూడా కనిపించిందని తీవ్ర వ్యాఖ్యలకు తెరతీశారు. ఇక వేరే కేసుల్లో ఎవరెవరినో ఎన్‌కౌంటర్ చేశారని గుర్తు చేసిన నారాయణ.. ఎన్‌కౌంటర్ చేయాలని తాము డిమాండ్ చేయడం లేదని.. కానీ బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయడానికి పోలీసులకు చేతకాలేదా అని ప్రశ్నించారు.
బండి భగీరథ్‌ను వెతకడానికి 10 టీమ్‌లను పంపించామని పోలీసులు చెప్పారని.. అయితే ఆ పది బృందాలు ఏం చేశాయని నిలదీశారు. ఈ వ్యవహారంలో ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని.. ఇది లాలూచీ పడటం కాదా అని తీవ్రంగా మండిపడ్డారు. ఈ ఒక్క కేసులో 3 వ్యవస్థలను నిర్వీర్యం చేశారని నారాయణ మండిపడ్డారు. కేసు పెట్టిన వెంటనే బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించి ఉంటే ఇంత జరిగి ఉండేది కాదని పేర్కొన్నారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు.. కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కూడా ముద్దాయిగా నిలిచాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో వెంటనే తగిన విచారణ జరగాలని నారాయణ డిమాండ్ చేశారు.

## కూటమి పాలనకు రెండేళ్లు పూర్తి

నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడిన అచ్చెన్నాయుడు.. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కానున్న నేపథ్యంలో జూన్ 12 నుంచి కొత్త వితంతు పింఛన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.
మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా వితంతువుల పింఛన్ల కింద 1.53 లక్షల మంది వరకూ అర్హులుంటారని సెర్ప్ అంచనా వేస్తోంది. నెలకు రూ.4వేల చొప్పున లక్షా 53 వేల మందికి వితంతు పింఛన్లు అందించేందుకు సుమారుగా రూ.61 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వం వచ్చాక స్పౌజ్ పింఛన్లు అందిస్తున్న సంగతి తెలిసిందే. స్పౌజ్ కేటగిరి కింద పింఛను తీసుకుంటున్న భర్త చనిపోతే.. అతని పింఛను మరుసటి నెలలోనే అతని భార్య పేరు మీదకు మార్చుతున్నారు. ఈ కేటగిరీ కింద ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా 2.30 లక్షల మందికి కొత్త పింఛన్లు అందించారు. అయితే పింఛను అందని భర్త చనిపోతే పరిస్థితి వేరుగా ఉంది. చనిపోయిన వ్యక్తి భార్యకు వితంతు పింఛన్ అందించటంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే జూన్ 12న అర్హులైన వితంతువులకు పింఛన్లు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. వితంతువుల తర్వాత అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. కొత్త దివ్యాంగ పింఛన్ల కోసం ఇప్పటికే చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులైన వారికి పింఛన్ అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## కరోనా కంటే డేంజరస్ వైరస్..

ఈ రెండు సందర్భాల్లో నమోదైన మొత్తం కేసుల కంటే ఈ ఒక్క ఏడాదిలోనే అత్యధిక కేసులు నమోదయ్యాయి. దీంతో చరిత్రలోనే అతి పెద్ద బుండిబుగ్యో ఎబోలా వ్యాప్తిగా రికార్డుల్లోకెక్కింది.

**ఎబోలా వైరస్ లక్షణాలు..**

విపరీతమైన జ్వరం.. నిరసం ఎక్కువగా ఉండటం.. గొంతు నొప్పి, కండరాల నొప్పి.. తలనొప్పి, వికారం, వాంతులతో పాటు కొన్ని సందర్భాల్లో తీవ్రమైన రక్త స్రావం అవుతూ ఉంటుంది. ఎబోలా వైరస్ ముందుగా కాంగోలోని మారుమూల మైనింగ్ ప్రాంతాల్లో వెలుగుచూసింది. ఇప్పుడది ప్రధాన నగరాలకు విస్తరించింది. ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. మే 16నాటికి కాంగోలోని ఇటూరి ప్రావిన్స్‌లో ల్యాబ్‌లో ధృవీకరించిన అనుమానిత కేసులు 336. అనధికారికంగా ఈ సంఖ్య అంతకుమించే ఉంటుందని తెలుస్తోంది. కాంగో ఉగాండా సరిహద్దుల్లోని గోల్డ్ మైన్ సిటీ మోంగ్‌బ్వా కేంద్రంగా ఎబోలా వ్యాప్తి కొనసాగుతోంది.
ఇక్కడి కార్మికులు నిరంతరం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్తుంటారు. ఈ ప్రాంతాల్లో నెలకొన్న అంతర్యుద్ధం.. అభద్రతాభావం.. ప్రజల వలసలు.. అధికారులపై స్థానికులకు ఉన్న అసంతృప్తి.. అపనమ్మకం కారణంగా కాంటాక్ట్ ట్రేసింగ్ చేయడం కష్టంగా మారింది. అయితే.. సరిహద్దులు మూసివేయడం.. లేదంటే ప్రయాణాలపై ఆంక్షలు విధించొద్దని WHO దేశాలకు సూచించింది. ఆంక్షలు విధిస్తే ప్రజలు దొంగచాటుగా సరిహద్దులు దాటి వైరస్‌ను మరింతగా వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించింది. శరవేగంగా విస్తరిస్తున్న ఎబోలా వైరస్‌పై WHO ఎమర్జెన్సీ ప్రకటించినా.. భారత్‌లో ఎలాంటి కేసులు నమోదు కాలేదంటోంది కేంద్రం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదంది. ఎబోలా దేశాల నుంచి ఇండియాకు వచ్చే వాళ్లపై పరిశీలన ఉంటుందని.. అన్ని ఎయిర్‌పోర్టుల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని స్పష్టం చేసింది.

## నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

- **పోగొట్టుకున్న పర్స్‌ను యజమానికి అప్పగించిన ఏఆర్ కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్**
- **కానిస్టేబుల్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ డి.జానకి,**

**జయభేరి, మహబూబ్‌నగర్ :**

మహబూబ్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్ తన నిజాయితీతో పోలీసు శాఖ గౌరవాన్ని మరింత పెంచారు. విధుల నిమిత్తం మహబూబ్‌నగర్‌లో ఉన్న సమయంలో ఆయనకు ఒక పర్స్ దొరికింది. ఆ పర్స్‌ను పరిశీలించగా అందులో క్రెడిట్ కార్డులు, ఏటీఎం కార్డులు, నగదు తదితర ముఖ్యమైన పత్రాలు ఉండటం గమనించారు.
పర్స్‌లో ఉన్న క్రెడిట్ కార్డు వివరాల ఆధారంగా యజమాని నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బాలరాజు అని గుర్తించారు. అనంతరం ధన్వాడ పోలీస్ స్టేషన్ ద్వారా బాలరాజుకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకొని అతనికి సమాచారం అందించారు. శ్రవణ్ కుమార్ సూచన మేరకు బాలరాజు మహబూబ్‌నగర్‌కు చేరుకోగా, అతనికి పర్స్‌లోని నగదు, కార్డులు మరియు ఇతర వస్తువులను యథావిధిగా తిరిగి అప్పగించారు. పోగొట్టుకున్న పర్స్ తిరిగి దొరకడంతో బాలరాజు ఆనందం వ్యక్తం చేస్తూ కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్ నిజాయితీని అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జిల్లా ఎస్పీ డి.జానకి, కానిస్టేబుల్ శ్రవణ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.
ప్రజల ఆస్తులను తమ సొంత ఆస్తుల్లా భావించి బాధ్యతాయుతంగా వ్యవహరించడం పోలీసు శాఖకు గర్వకారణమని ఆమె పేర్కొన్నారు. లాంటి నిజాయితీతో కూడిన సేవా భావం ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని ఎస్పీ తెలిపారు. ఈ ఘటన పోలీసుల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచేదిగా నిలిచిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే కాకుండా వారి ఆస్తులను సురక్షితంగా కాపాడేందుకు పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని అధికారులు తెలిపారు.

# డాలర్ స్థానంలో బ్రిక్స్




ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త రకమైన 'క్యూ' కనిపిస్తోంది. ఒకప్పుడు అమెరికా డాలర్ కనిపిస్తే చాలు జోహార్లు అర్పించిన దేశాలన్నీ, ఇప్పుడు 'మాకు ఈ డాలర్ వద్దు.. బ్రిక్స్ దోస్తీ ముద్దు' అంటూ ఆ దేశాల కూటమి ముందు క్యూ కడుతున్నాయి. ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసిన ఏప్రిల్, 2026 గణాంకాలను చూస్తుంటే, ఇది కేవలం ఒక కూటమిలా కాకుండా.. అమెరికా, యూరప్ దేశాలకు నిద్రలేకుండా చేసే ఒక 'ప్రత్యామ్నాయ ప్రపంచం'లా కనిపిస్తోంది. చైనా భారీ జీడీపీ నుంచి మొదలుకొని, పాలస్తీనా వంటి చిన్న దేశాల వరకు అందరూ ఈ క్లబ్‌లో మెంబర్‌షిప్ కోసం తహతహలాడుతుండటం చూస్తుంటే.. భవిష్యత్తులో వైట్ హౌస్ కంటే 'బ్రిక్స్' ఆఫీసు ముందే రద్దీ ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది.బ్రిక్స్ సభ్య దేశాల జీడీపీ లెక్కలు చూస్తుంటే, చైనా ఏకంగా $20.85 ట్రిలియన్లతో అందనంత ఎత్తులో కూర్చుంది. దానికి పోటీగా భారతదేశం కూడా $4.15 ట్రిలియన్లతో తన సత్తా చాటుతోంది. ఈ రెండు దేశాలు కలిస్తేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా వాటా ఉండేలా ఉంది. బ్రెజిల్, రష్యా కూడా చెరో రెండున్నర ట్రిలియన్లతో తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక్కడ ఒక వింత ఉంది.. ఒకవైపు రష్యాపై ఇన్ని ఆంక్షలు ఉన్నా, దాని జీడీపీ మాత్రం నిలకడగా ఉండటం పాశ్చాత్య దేశాలకు మింగుడుపడని నిజం. సంక్షేమ పథకాలు, అప్పులతో కుస్తీ పడుతున్న దక్షిణాఫ్రికా, ఈజిప్ట్ వంటి దేశాలు కూడా ఈ భారీ ఇంజన్ల అండ చూసుకునే ధైర్యంగా అడుగులు వేస్తున్నాయి.ఈ జాబితాలో ఇండోనేషియా ($1.54 ట్రిలియన్) వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు పూర్తి సభ్యులుగా మారుతుంటే, పాకిస్థాన్ ($410 బిలియన్), శ్రీలంక ($98 బిలియన్) వంటి దేశాలు మాత్రం దరఖాస్తు పట్టుకొని దీనంగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్థాన్ పరిస్థితి చూస్తుంటే.. 'సభ్యత్వం ఇస్తే ఇయ్యండి కానీ, ముందు ఏవైనా లోన్లు ఉంటే చూడండి' అని అడిగేలా ఉంది. అప్పుల ఊబిలో ఉన్న దేశాలన్నీ బ్రిక్స్‌ను ఒక 'ఏటీఎం'లా చూస్తుంటే, అసలు సభ్య దేశాలు మాత్రం దీన్ని ఒక 'పొలిటికల్ వెపన్' (రాజకీయ ఆయుధం)లా వాడుకోవాలని ప్లాన్ చేస్తున్నాయి. ఇక సౌదీ అరేబియా లాంటి ధనిక దేశాలు కూడా చేరితే, బ్రిక్స్ దగ్గర ఆయిల్ కు, డబ్బుకు అస్సలు కొదవ ఉండదు. నైజీరియా నుంచి వియత్నాం వరకు దాదాపు 10 దేశాలు భాగస్వామ్య హోదాలో ఉంటూ లోపలికి రావడానికి గేట్ల దగ్గర వేచి చూస్తున్నాయి. వియత్నాం ($527 బిలియన్), మలేషియా ($516 బిలియన్) వంటి ఆగ్నేయాసియా పులులు ఈ కూటమిలో చేరితే, ఇక ఆసియా ఖండం మొత్తం బ్రిక్స్ గుప్పిట్లోకి వెళ్లడం ఖాయం. ఒకప్పుడు అభివృద్ధి చెందిన దేశాల జీ7 (G7) గ్రూపును చూసి భయపడిన ప్రపంచం, ఇప్పుడు బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్+) వైపు ఆశగా చూస్తోంది. ఈ కూటమిలో డేటా లేని క్యూబా, సిరియా వంటి దేశాలు కూడా ఉన్నాయంటే, ఇక్కడ ఆర్థిక స్థితి కంటే 'అమెరికా వ్యతిరేకత' అనే గూడుపుఠాణీనే ఎక్కువగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. చిన్న దేశాల 'పెద్ద' కలలు కేవలం $3.49 బిలియన్ల జీడీపీ ఉన్న సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నుంచి, అంతర్యుద్ధాలతో అల్లాడుతున్న ఆఫ్ఘనిస్తాన్ వరకు అందరూ ఈ జాబితాలో ఉన్నారు. వీరందరికీ బ్రిక్స్‌లో చేరడం అంటే ఏదో మంత్రదండం దొరికినట్లే అన్నంత ఆశ ఉంది. చైనా ఇచ్చే పెట్టుబడులు, భారత్ ఇచ్చే సాంకేతికత తమ దేశాలను మార్చేస్తాయని వారు నమ్ముతున్నారు. అయితే, ఇంత మంది ఒకే గూటి కింద చేరితే.. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చుతాయా? లేక ఇది కేవలం ఫోటో షూట్లకే పరిమితం అవుతుందా? అన్నది భవిష్యత్తు తేల్చాలి. మొత్తానికి, బ్రిక్స్ విస్తరణ చూస్తుంటే.. 'డబ్బు ఉన్నవాడు, అప్పు ఉన్నవాడు, యుద్ధం చేస్తున్నవాడు.. అందరూ కలిశారు. ఇక డాలర్ గారే జాగ్రత్తగా ఉండాలి' అనిపిస్తోంది. ఐఎంఎఫ్ రిపోర్ట్ ప్రకారం ఈ కూటమి ఇలాగే పెరిగితే, ఇక ప్రపంచం ఢిల్లీ‌బీజింగ్ చుట్టూ తిరగడం ఖాయం!



## కూతురిని వరల్డ్ నంబర్ వన్‌గా నిలిపిన తల్లి

- **60+లో ఊహించని ఫిట్‌నెస్ ఛాలెంజ్!**

**జయభేరి, హైదరాబాద్ :**

సూర్య నమస్కారాలు చేస్తూ అందరినీ ఆశ్చర్యపరిచిన సైనా నెహ్వాల్ తల్లి, తాజాగా సాంప్రదాయ భారతీయ వ్యాయామమైన 'ఉతక్ బైఠక్' (స్క్వాట్స్) చేస్తూ సోషల్ మీడియాలో సరికొత్త ఫిట్‌నెస్ గోల్స్‌ను సెట్ చేస్తోంది. తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ఈ వీడియోను షేర్ చేస్తూ.. "ఆమె ఎప్పుడూ లొంగిపోదు.. నన్ను ప్రపంచ నంబర్ 1 స్థానానికి చేర్చిన నా తల్లి.. నా ఫైటర్ మామ్" అంటూ ఎంతో గర్వంగా రాసుకొచ్చింది సైనా. ఈ వీడియో నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకోవడంతో పాటు, గూగుల్ ట్రెండ్స్‌లో సైతం టాప్‌లో నిలిచింది.
శరీర బరువు ఆధారంగా చేసే లోతైన స్క్వాట్స్‌ను మన దేశంలో సాంప్రదాయకంగా 'ఉతక్ బైఠక్' అని పిలుస్తారు. ఇది కేవలం ఒక సాధారణ వ్యాయామం మాత్రమే కాదు, శారీరక దృఢత్వానికి అద్భుతమైన సాధనం అని క్లినికల్ డైటీషియన్ మరియు ఫిట్‌నెస్ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ వ్యాయామం ప్రధానంగా తొడలు (క్వాడ్రిసెప్స్), పిరుదులు (గ్లూట్స్), హామ్‌స్ట్రింగ్స్, కోర్ కండరాలపై ప్రభావం చూపిస్తుంది. వృద్ధాప్యంలో ఎవరి సహాయం లేకుండా స్వతంత్రంగా జీవించడానికి ఈ కండరాలు బలంగా ఉండటం చాలా ముఖ్యం. కిందకు కూర్చుని మళ్లీ సులభంగా పైకి లేవగలగడం అనేది మంచి కండరాల బలానికి, కీళ్ల కదలికలకు (మొబిలిటీ) నిదర్శనం. ఇది వయసు పైబడిన వారిలో ఆకస్మికంగా కింద పడిపోయే ప్రమాదాలను (ఫాల్ రిస్క్) తగ్గించి, జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది.
జిమ్‌లలో ఉండే మెషిన్ల సహాయంతో చేసే వర్కవుట్ల కంటే, ఇవి రోజువారీ జీవితంలో మనం చేసే సహజమైన కదలికలకు శిక్షణ ఇస్తాయి. నియంత్రిత పద్ధతిలో చేసే ఈ వ్యాయామం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడటమే కాకుండా, కీళ్ల మధ్య లూబ్రికేషన్ (జిగురు) సక్రమంగా అందుతుంది. బరువును మోస్తూ చేసే ఇలాంటి వ్యాయామాలు ఎముకల సాంద్రతను (బోన్ డెన్సిటీ) పెంచుతాయి. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్ తర్వాత వచ్చే ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) వ్యాధి ముప్పును తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.
ఈ వ్యాయామం ఎంతో మేలు చేసినప్పటికీ, శారీరక సామర్థ్యాన్ని బట్టి మాత్రమే దీనిని చేయాలి. తీవ్రమైన మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి లేదా బ్యాలెన్స్ తప్పే సమస్యలు ఉన్నవారికి ఈ డీప్ స్క్వాట్స్ సరిపోకపోవచ్చు. అలాంటి వారు నేరుగా కిందకు కూర్చోకుండా.. ఒక కుర్చీ మద్దతు తీసుకుని గానీ, లేదా తక్కువ లోతు వరకు మాత్రమే వంగుతూ మోడిఫైడ్ వెర్షన్స్ చేయడం సురక్షితం. ఈ వైరల్ వీడియో కేవలం శారీరక వ్యాయామాన్ని మాత్రమే కాకుండా, ఆలోచనా విధానంలో రావాల్సిన మార్పును చూపిస్తోంది. ఫిట్‌నెస్ అనేది వయసుతో ముడిపడి ఉన్నది కాదు, అది క్రమశిక్షణ, నిరంతర సాధనపై ఆధారపడి ఉంటుంది.

## సరస్వతీ నదీ పుణ్య స్నానాలు



- **ఈనెల 21 వ తేదీ నుండి జూన్ 1 వరకు సరస్వతీ నదీ అంత్య పుష్కరాలు**
- **దాదాపు 40 లక్షల మంది హాజరవుతారని అంచనా**
- **మొదటి రోజు శ్రీ జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర**
- **సరస్వతీ స్వామి, రాష్ట్ర గవర్నర్ ల పుణ్య స్నానాలు**
- **సచివాలయంలో ఏర్పాట్లను సమీక్షించిన మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, సి.ఎస్ రామకృష్ణారావు**

**జయభేరి, హైదరాబాద్ :**

ఈనెల 21 వ తేదీన కాళేశ్వరంలో ప్రారంభం కానున్న సరస్వతీ అంత్య పుష్కరాలకు దాదాపు 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేసినందున, ఈ పుష్కరాలకు హాజరయ్యేవారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లను చేపడుతున్నట్లు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సరస్వతీ అంత్య పుష్కరాల ఏర్పాట్లపై నేడు డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామ చంద్రన్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఐ.జి చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, ఐ.టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మే 21 వ తేదీ ఉదయం 5.43 గంటలకు కంచి కామకోటి పీఠం స్వామి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ పుణ్య స్నానం ఆచరించి సరస్వతీ అంత్య పుష్కరాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈసారి దాదాపు 30 నుండి 40 లక్షల మంది ఈ అంత్య పుష్కరాలకు హాజరయ్యే అవకాశం ఉందని, వారికి ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా కాళేశ్వరం ఆలయంలో దర్శనాలు, పుష్కర స్నానాలకు వచ్చే వివిధ పీఠాధిపతులకు తగు ఏర్పాట్లు, పుష్కర ఘాట్ ల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఇటీవల విజయవంతంగా నిర్వహించిన మేడారం జాతర స్ఫూర్తితో సరస్వతి అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజి ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారని, ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.
ఈ అంత్య పుష్కరాల అనుభవాలు రానున్న గోదావరి పుష్కరాలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు మాట్లాడుతూ, ఈ అంత్య పుష్కరాలకు విస్తృతమైన మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేసినందున పెద్ద సంఖ్యలో యాత్రికులు హాజరయ్యే అవకాశమున్నందున శానిటేషన్, ట్రాఫిక్, ప్రోటోకాల్, రవాణా, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు.
రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, 2012 లో జరిగిన సరస్వతి పుష్కరాలకు కేవలం 2 లక్షల మంది మాత్రమే హాజరవగా, గత సంవత్సరం జరిగిన ఆది పుష్కరాలకు దాదాపు 40 లక్షల మంది హాజరయ్యారని వెల్లడించారు. ఈ అంత్య పుష్కరాలలో ప్రతి రోజు హోమాలు, ఘాట్ వద్ద హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, తెప్పోత్సవం నిర్వహణతో పాటు పెద్ద పిండ ప్రదానాలు జరుగుతాయని అన్నారు. మొదటి రోజు కంచి స్వామిజీతోపాటు రాష్ట్ర గవర్నర్ కూడా పుణ్య స్నాలకు హాజరవుతారని అన్నారు. ఈసారి ప్రత్యేకంగా ఒక మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు మాట్లాడుతూ, అతిథి గృహాలు, 100 గదుల చౌల్ట్రీ, ఘాట్ వద్ద టెంట్ హౌస్ ల ఏర్పాటు, ప్రముఖులకు ఆహ్వానాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాట్లకు రెవెన్యూ శాఖ సమన్వయం చేపడుతోందని అన్నారు. రవాణా శాఖ తాత్కాలిక బస్ స్టేషన్లు ఏర్పాటు చేయడం, షటిల్ బస్సులు నడపడం, రవాణా సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టిందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, ఘన వ్యర్థాల తొలగింపు వంటి ఏర్పాట్లు గ్రామీణ నీటి సరఫరా శాఖ చేస్తుందని అన్నారు. అలాగే, వైద్య ఆరోగ్య శాఖ 12 రోజుల పాటు వైద్య శిబిరాలు, అంబులెన్సులు, మందులు, అత్యవసర బృందాలను ఏర్పాటు చేస్తుందని, పోలీసు శాఖ తగిన పార్కింగ్ ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాల గుర్తింపు, రూట్ మ్యాపులు, లేఅవుట్ తయారీ, వాచ్ టవర్లు, సీసీటీవీ పర్యవేక్షణ, వాకీటాకీలు, మొబైల్ కనెక్టివిటీ, సూచిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామ చంద్రన్, జెన్ కో ఎండి హరీష్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి, భూపాల పల్లి ఎస్.పి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# కాప్రా చెరువుకు మహర్దశ

- కాప్రా చెరువు సుందరీకరణ కోసం రూ. 35 కోట్ల నిధులు
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

BRS పార్టీ సీనియర్ నాయకులు బైరీ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో కాప్రా చెరువు వద్ద కాప్ర చెరువు పునరుద్ధరణ మరియు సుందరీకరణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాప్ర ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమం ప్రజల్లో ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాప్ర చెరువును సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 35 కోట్ల రూపాయల ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని తెలిపారు. చెరువు పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరంగా గడిపేలా వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు, లైటింగ్, విశ్రాంతి ప్రదేశాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా కాప్ర చెరువు సుందరీకరణ కోసం సుమారు రూ.35 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన తర్వాత కాప్ర చెరువు నగరంలో ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, స్థానిక ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మెన్ రావుల శ్రీధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు కొత్త రామారావు, ప్రభుదాస్, శ్రీనివాస్ రెడ్డి, గొల్లూరి అంజయ్య, పన్నాల దేవేందర్ రెడ్డి, BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి సాయి జెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, గంధం నాగేశ్వర్ రావు, నీలం రెడ్డి, దామోదర్, BA రాంచందర్ గౌడ్, సంజీవ రెడ్డి BRS పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# అనగాపురి కాలనీ నూతన కమిటీని సన్మానించిన సింగిరెడ్డి పద్మా రెడ్డి

- కాలనీ అభివృద్ధి లక్ష్యంగా కృషి చేయాలని నూతన కమిటీకి సూచన
- నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన సింగిరెడ్డి

**జయభేరి, మేడిపల్లి:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని అనగాపురి కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలలో రావుల శ్రీనివాసరెడ్డి విజయం సాధించి నూతన అధ్యక్షుడిగా గత వారం ఎన్నికయ్యారు. అధ్యక్షులు రావుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కోశాధికారిగా ఆకుల సదాశివ గుప్త, ప్రధాన కార్యదర్శిగా ఏనుగు సంజీవరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా దాచేపల్లి నాగరాజ్, ఉపాధ్యక్షులుగా ఉమ్మడోజు యాదగిరి చారి, పేసరి సత్తిరెడ్డి, బండ రామ్మూర్తి యాదవ్, సహాయ కోశాధికారి గొట్టి ముక్కల వెంకట్ రెడ్డి, సమన్వయ కార్యదర్శి రచ్చ సత్యానారాయణ, కార్యనిర్వహక కార్యదర్శులు కొత్తోజు కృష్ణా చారి, సోమ రామ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కొమ్మ బాబు, ఎర్ర సోమయ్య, సంస్కృతిక కార్యదర్శులు బాకీ బాల్రాజ్, సాయిని, కిరణ్, సలహాదారులు మట్ట సెట్టయ్య గౌడ్, మాదిరెడ్డి మోహన్ రెడ్డి, మహేశ రవిచంద్రన్ , పెరుమాండ్ల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు గడ్డం ధర్మారెడ్డి, వనపర్తి మనోజ్ కుమార్, లో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకతీతంగా కాలనీ అభివృద్ధి లక్ష్యంగా నూతన కమిటీ కృషి చేయాలని ఆయన సూచించారు.



# నేడు దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ పర్యటన

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోమవారం నియోజకవర్గంలోని ఆయా మండలాలలో పర్యటించనున్నారు.ఈ సందర్భంగా ముందుగా ఉదయం 10:30 గంటలకు మధనాపురం మండలం దంతనూర్ మరియు శంకరంపేట గ్రామాల మధ్యలో వాగుపై వంతెన నిర్మాణానికి నిర్వహించే భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొంటారు. అలాగే 11:30 గంటలకు కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

# మజ్జిగ పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్న ట్రాన్స్ జెండర్స్

- మీ సేవలో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ట్రాన్స్ జెండర్స్




**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణంలో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి ఆదివారం కొండమల్లేపల్లి ట్రాన్స్ జెండర్స్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో 120 కేజీల పెరుగును వితరణగా ఇచ్చి మజ్జిగ పంపిణీ చేశారు. మీ సేవలో మేము సహితం అంటూ కొండమల్లేపల్లి ట్రాన్స్జెండర్ కమ్యూనిటీ వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో అల్లాడుతున్న ప్రజలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు వారిని అభినందించారు. ఆదివారం కావడంతో 2500 మంది ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆర్థికంగా పరిపుష్టితో ఉన్న ఎంతోమంది పది రూపాయలు దానం చేయని ఈ రోజుల్లో ట్రాన్స్ జెండర్స్ ముందుకు వచ్చి సొంత ఖర్చులతో మజ్జిగ పంపిణీ చేయడం మెచ్చుకోదగ్గ విషయం అని పలువురు అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమం లో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా సొసైటీ ఆధ్వర్యంలో ట్రాన్స్ జెండర్ కమ్యూనిటీ కొండమల్లేపల్లి లాస్య, జయలను ఘనంగా సన్మానించారు.ఇలాంటి సేవలలో మునుముందు ఇంకా పాల్గొంటామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, కూన భాను చందర్, సైదులు, అలంపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**జయభేరి, సైదాపూర్ :**



అలనాటి మధురస్మృతుల కోసం మళ్లీ ఒకరోజు శిష్యుల ఎదుగుదలే గురు దక్షిణగా భావించి పూజ్యులైన గురువుల సమక్షంలో 39 సంవత్సరాల తర్వాత అపురూప కలయిక.. కరీంనగర్ జిల్లా, సైదాపూర్ మండలం, దుద్దునపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986-87 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సమావేశ కర్తలు.. ఎస్ రాజయ్య, టి నారాయణ రెడ్డి. సభాధ్యక్షులు.. ఆడెపు రాజేందర్, పరకాల నారాయణ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కే శ్రీనివాస్ రెడ్డి ఎంఈఓ, సునీత PS HM హాజరైనారు.
విద్యాబోధనలు చెప్పినా గురువుల ఆహ్వానించుకొని వారికి ఘనంగా సన్మానం చేసినారు. ఈ సందర్భంగా మిత్రులందరికీ తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ చదువులమ్మ ఒడిలో ఆటపాటలతో ఆనందంలో మునిగితేలారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. 39 సంవత్సరాల క్రితం చదువు నేర్పిన గురువులను గుర్తుంచుకొని సన్మానం చేసినందుకు ఇంత మంది విద్యార్థులు ఉన్నతంగా ఉన్నందుకు చూసి ఆనందంతో మురిసిపోతూ చిరకాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలను మిగిల్చారని అన్నారు విద్యార్థులందరూ అప్పటి సంఘటనలను గురువులతో ఉన్న అనుబంధాలను మిత్రులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు.




# జనజాతీయ గరిమా ఉత్సవ్

- అభివృద్ధికి సాంకేతికత ఒక ప్రేరక శక్తి

**జయభేరి, దేవరకొండ :**

డిజిటల్ అవగాహన, పారిశ్రామికోత్పత్తి అభివృద్ధి, ఆవిష్కరణలు, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించమే జనజాతీయ గరిమా ఉత్సవ్ - 2026 ప్రధాన ఉద్దేశమని సాంకేతిక సెషన్‌ను క్లావెరిట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మణికంఠ స్వామి యాతం ,బంజారా మాక్స్ సొసైటీ డైరెక్టర్ లావుడి భాష తెలిపారు. గిరిజన సహకార మార్కెటింగ్ అభివృద్ధి సమాఖ్య ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ ఆధ్వర్యంలో, గిరిజన సంక్షేమ శాఖ ,రాష్ట్ర నోడల్ విభాగం సహకారంతో దేవరకొండ మండల పరిధిలోని పెంచికల్‌పాడు మోడల్ స్కూల్ వద్ద ఏ ఐ & డిజిటల్ అవగాహన, గిరిజన పారిశ్రామికోత్పత్తి, ఉత్పత్తుల బ్రాండింగ్ వీడీవీకే అనుసంధానం అంశాలపై ప్రత్యేక శిక్షణా శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 35 మంది గిరిజన కళాకారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. బంజారా హస్తకళలు, గిరిజన ఆభరణాలు, ఎంబ్రాయిడరీ కళాఖండాలు,ఇతర సంప్రదాయ గిరిజన కళారూపాలను ప్రదర్శించారు. ఈ ఉత్పత్తులు గిరిజన సమాజాల గొప్ప సాంస్కృతిక వారసత్వానికి,సంప్రదాయ నైపుణ్యాలను ప్రతిబింబించాయి.ఎం. అరుణ ఎస్. జ్యోతి, గిరిజన కళాకారులను సమీకరించి కార్యక్రమంలో పాల్గొనడానికి తోడ్పాటు అందించారు. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ సాధనాలు కాన్వా వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి ఉత్పత్తుల బ్రాండింగ్, ప్యాకేజింగ్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్ మరియు గిరిజన ఉత్పత్తుల ప్రోత్సాహంపై సమగ్ర అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతికత ద్వారా గిరిజన కళాకారులు తమ ఉత్పత్తుల ప్రాచుర్యాన్ని పెంచుకొని స్థిరమైన ఉపాధి అవకాశాలను ఎలా సాధించగలరో వివరించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ సాక్షరత, సోషల్ మీడియా ప్రచారం, ఈకామర్స్ అవకాశాలు, విలువ ఆధారిత ఉత్పత్తి అభివృద్ధి వన్ ధన్ వ్యవస్థలో గిరిజన పారిశ్రామికోత్పత్తి బలోపేతంపై అవగాహన కల్పించబడింది. ఉత్పత్తుల లేబుల్స్, ప్రచార పదార్థాలు మరియు ప్యాకేజింగ్ రూపకల్పన కోసం సులభమైన డిజిటల్ సాధనాలపై ప్రాక్టికల్ ప్రదర్శనలు కూడా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం వికసిత భారత్ @2047 దిశగా గిరిజన కళాకారులను శక్తివంతం చేయాలనే గిరిజన సహకార మార్కెటింగ్ అభివృద్ధి సంస్థ సంకల్పం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.జి. చలవాడి, ఉప మేనేజర్, కె. రాంబాబు, అసిస్టెంట్ మేనేజర్ వెంకట సాయిరామ్ పాల్గొన్నారు.



# మొయినాబాద్ ఫామ్ హౌస్లో ఇద్దరు మహిళల హత్య

**జయభేరి, మొయినాబాద్ :**

మొయినాబాద్ లో ఒక ఫామ్ హౌజ్ లో ఇద్దరు మహిళల దారుణ హత్య ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళలు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల తోల్కట్ట గ్రామ సమీపంలో శవాలైన తాండూరుకు చెందిన వారుగా గుర్తించారు. వికారాబాద్ జిల్లా తాండూరులో మిస్సైయారు. తాండూరు నుండి వృద్ధ మహిళలను తీసుకువెళ్లి హైదరాబాద్ శివారు ప్రాంతమైన చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామ సమీపంలో గల ఫామ్ హౌస్ దగ్గర నిర్మానుష్య ప్రదేశంలో హత్య చేసి పూడ్చివేసారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# అగస్త్య బయోమెడికల్ కాలనీ సైన్ బోర్డ్



**జయభేరి, మేడిపల్లి:**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేడిపల్లి డివిజన్ సాయి హిల్స్ కాలనీలో అగస్త్య బయోమెడికల్ కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ పంతం భానుశేఖర్ ఏర్పాటు చేయించిన కాలనీ సైన్ బోర్డ్ లను మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మధుసూదన్ కార్యదర్శి మోహన్ రెడ్డి విహారిక కాలనీ అధ్యక్ష కార్యదర్శులు రవీందర్ రెడ్డి, విజయ్ కాలనీ పెద్దలు సత్యనారాయణ, మహేందర్, శ్రవణ్, వేణుగోపాల్, శోభన్ బాబు, రాజేశ్వరి, శైలేష్ రెడ్డి, రామాంజనేయ రెడ్డి, భాను, రాజేందర్, రఘురామ్, శ్రీకాంత్, జోసెఫ్ రెడ్డి, హరి, రాజు తదితరులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# విద్యుత్ అగాధంతో మృతి చెందిన వానరం

- వానరానికి హిందూ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు



**జయభేరి, కొండమల్లేపల్లి :**

పట్టణంలోని హైదరాబాదు రోడ్డులో వానరం విద్యుత్ అగాధంతో ఆదివారం ఉదయం మృతి చెందింది. అటువైపుగా వెళ్లిన యువకులు వానరం మృతి చెందిన విషయాన్ని గమనించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు అక్కడికి చేరుకున్నారు. హిందువులు వానరాన్ని ఆంజనేయ స్వామి రూపంగా కొలుస్తారు. అలాంటి వానరం మృతి చెందడంతో కలత చెంది బాధపడ్డారు. హిందూ సంప్రదాయ పద్ధతిలో వానర మృతదేహానికి కుంకుమ పెట్టి పూలదండలు వేసి పూడ్చారు. అనంతరం కాషాయ కండువా కప్పి, కాషాయ జెండా ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. వానరం చనిపోవడం బాధాకరమని, తమ చేతుల మీదుగా వానర మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి భూతరాజు దాసు, కొండమల్లేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏరుకొండ రాము, కొండమల్లేపల్లి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు భూతరాజు భరత్ కుమార్, నెల్లికంటి గోపి, శివ గౌడ్, సాయి, వెంకటేశ్వర్లు, ఉదయ్, అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

# భూముల ధరలు పెంచుతున్నాం

**జయభేరి, హైదరాబాద్, మే 16 :**

తెలంగాణలో భూముల మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ ధరల) పెంపుదలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాష్ట్రంలో త్వరలోనే శాస్త్రీయ పద్ధతిలో భూముల మార్కెట్ విలువను సవరించబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో భూముల విలువ భారీగా పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాలను ప్రామాణికంగా తీసుకుని ఈ ధరల పెంపు ఉంటుందని వివరించారు. ఈ శాస్త్రీయ సవరణల వల్ల కొన్ని ప్రాంతాలలో మార్కెట్ విలువ కనీసం రూ. 15 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.గత ప్రభుత్వం ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గతంలో రెండు సార్లు భూముల విలువను పెంచిందని మంత్రి గుర్తుచేశారు. అయితే, చివరిగా 2022 ఫిబ్రవరిలో భూముల మార్కెట్ విలువను సవరించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ధరల్లో ఎలాంటి మార్పులు చేయలేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# భక్తజన సంద్రమైన యాదగిరిగుట్ట

- వేసవి సెలవులు కావడంతో యాదాద్రికి పోటెత్తిన భక్తులు
- శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్యరాబడి రూ.52.63 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 17 :**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం భక్తజన సంద్రమైంది. వేసవి సెలవులు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఎండలను సైతం లెక్క చేయకుండా శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి కొండ పైన,కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. స్వామి వారి మెట్ల మార్గం, ఘాట్ రోడ్లలో భక్తులు సందడి చేశారు. స్వామి వారి దర్శన క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం,టికెట్ల విక్రయ కేంద్రాలు,పార్కింగ్,బస్టాండ్, పుష్కరిణి,తలనీలాలు సమర్పించే కేంద్రం,శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి,అమ్మవార్లకు రూ.52,63,697 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,12,600,బ్రేక్ దర్శనం ద్వారా రూ.3,99,900, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,49,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.9,26,700, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.7,24,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,02,432, ప్రసాద విక్రయం ద్వారా రూ.18,53,200, కల్యాణకట్ట ద్వారా రూ.1,50,000తోపాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

# పిడికెడు మందితో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఏర్పాటు

- తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ గత 9 సంవత్సరాలుగా చేస్తున్న ఉద్యమం ఫలితమే నేడు కె కె కమిటీ ఏర్పాటు
- డా. చీమ శ్రీనివాస్, ఫౌండర్ చైర్మన్

**జయభేరి, హైదరాబాద్ :**



అమర వీరుల బలిదానాలతో తెలంగాణ ఉద్యమ కారుల ఉద్యమాల పోరాటాలతో వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యమ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించిన సమయంలో మేము ఉద్యమకారులమని.. ఉద్యమకారులే మర్చిపోయిన సమయంలో 9 సంవత్సరాల క్రితం పిడికెడు మందితో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమును ఏర్పాటు చేసి.. విడిపోయిన తెలంగాణ ఉద్యమకారులను చైతన్యం చేసి.. ఐక్యం చేసి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమము కోసం ఆత్మగౌరవం కోసం అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు ఉద్యమ నాయకులు ఆలోచించాలని గొంతు ఎత్తిన మొట్టమొదటి సంఘం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అని డా చీమ శ్రీనివాస్, ఫౌండర్ చైర్మన్ అన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటు అంటే జార్ఖండ్ ఛత్తీస్ గడ్ లాంటి రాష్ట్రాల ఏర్పాటు కోసం ఉద్యమం చేసిన ఉద్యమ కారులను ఏ విధంగా ఆ రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి గౌరవిస్తూ సంక్షేమ ఫలాలు అందిస్తున్న విధంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా తెలంగాణ ఉద్యమకారుల కోసం అప్పుడు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ చేయాలని ఉద్యమం చేసిన సంఘం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం. విడిపోయిన తెలంగాణ ఉద్యమకారులని వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులని ఐక్యం చేస్తూ చైతన్యం చేస్తూ 33 జిల్లాలు తిరుగుతూ అనేక సదస్సులు నిర్వహిస్తూ తెలంగాణ ఉద్యమకారుల కోసం ఈ రాజకీయ పార్టీల ఆలోచించాలని ఉద్యమం చేసిన సంఘం తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం .తెలంగాణ ఉద్యమకారుల సంతకాల సేకరణ. ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కి లేఖలు, రౌండ్ టేబుల్ సమావేశాలు .హైదరాబాదులో 33 జిల్లాల్లో ఉద్యమకారులకు సన్మానాలు. ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు. గన్ పార్కు వద్ద ధర్నా లు.పాద యాత్రలు. పోస్ట్ కార్డు ఉద్యమం. స్వయంగా కలిసి అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ పెద్దలకి విజ్ఞప్తులు. 23 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిక చేయడం జరిగింది కానీ ఆనాడు కెసిఆర్ విస్మరించడం జరిగింది ఉద్యమకారులని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారుల అంశాన్ని అజెండాగా చేసి అన్ని రాజకీయ పార్టీలని కలిసి అసెంబ్లీ ఎన్నికలలో మీమీ పార్టీల మేనిఫెస్టోలో ఉద్యమకారుల సంక్షేమ కోసం మేనిఫెస్టోలో చేర్చాలని కోరడం జరిగింది. ప్రస్తుత ముఖ్యమంత్రి ఆనాడు పిసిసి అధ్యక్షులుగా ఉన్నటువంటి రేవంత్ రెడ్డిని కలిసి ఉద్యమకారుల సంక్షేమం కోసం తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమ కారుల సంక్షేమం పై హామీలు చేర్చాలని కోరడం జరిగింది. ఆనాడు పిసిసి మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిల శ్రీధర్ బాబుని కలిసి చర్చించి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో 250 గజాల ఇంటి స్థలం పెన్షన్ సౌకర్యము చేర్పించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడం జరిగింది విస్మరించినటువంటి పార్టీలకి తగిన గుణపాఠం నేర్పించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారం వచ్చిన తర్వాత కూడా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అనేక సదస్సులు బస్సుయాత్రలు ర్యాలీలు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడం జరిగింది. హరిహర కళా భవన్ హైదరాబాదులో వేలాది మందితో సదస్సు పెట్టి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ని ముఖ్యఅతిథిగా ఆహ్వానించి పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. ఆ సదస్సులో ఆ రోజే పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రితో చర్చించి తెలంగాణ ఉద్యమకారుల హామీల అమలు కోసం కమిటీ ఏర్పాటు చేసుకుందామని హామీ ఇవ్వడం జరిగింది. ఆనాటి నుండి నేటి వరకు ఈ కమిటీ ఏర్పాటు కోసం పొన్నం ప్రభాకర్ సీరియస్ గా ప్రభుత్వంతో మాట్లాడి ఈ కమిటీ ఏర్పాటులో ముఖ్య భూమికని పోషించడం జరిగింది. గత నెలలో తార్నాకలో వేలాది మంది ఉద్యమ కారులతో సదస్సు నిర్వహించి వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయటం జరిగింది. ఆ సదస్సులో కూడా పొన్నం ప్రభాకర్ ఫోన్ ద్వారా సంఘీభావం ప్రకటించి మాట్లాడటం జరిగింది కమిటీ ఏర్పాటు చేస్తున్నాం అని ప్రకటించటం జరిగింది గత తొమ్మిది సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం సంక్షేమ కోసం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చేస్తున్న ఉద్యమ ఫలితము ఈ కమిటీ ఏర్పాటు. ఈ కమిటీ ద్వారా నిజమైన ప్రతి ఉద్యమకారుడిని గుర్తించాలని సంక్షేమ ఫలాల్లో అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం లక్ష్యం తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం సంక్షేమం. సామాజిక ప్రజాస్వామ్య తెలంగాణ. తెలంగాణ పునర్నిర్మానం. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడటం. గత తొమ్మిది సంవత్సరాలుగా ఎన్నో వడిదుడుకులను ఎదుర్కొని నేడు వేలాదిమంది ఉద్యమకారుల సభ్యత్వంతో 33 జిల్లాలలో మండల కమిటీలతో ఒక బలమైన ప్రజాసంఘంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నిటారుగా నిలబడి తెలంగాణ ఉద్యమకారుల గొంతుకగా తెలంగాణ సమాజంకు దిక్సూచిగా పనిచేస్తుంది.

# కబ్జా కోరల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణం



- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- అధికారులు స్పందించకపోతే రహదారుల దిగ్బంధనం చేస్తామన్న - కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, మే 16 :**

జగన్ గూడలో గ్రామీణ ప్రాంత క్రీడాకారుల కోసం గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ స్థలంపై కొందరి కన్ను పడింది. క్రీడాకారులకు వేదిక కావాల్సిన ఈ క్రీడా ప్రాంగణం కబ్జా రాయుళ్ల కబంధ హస్తాల్లో చిక్కుకుపోయిందని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అయితే ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన అధికారులు కొంతమందికి వత్తాసు పలుకుతూ వారికి అనుకూలంగా నివేదికలు తయారుచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హైడ్రా చట్టాన్ని తీసుకువస్తే మేడ్చల్ జిల్లాలో మాత్రం ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జగన్ గూడ నుండి పలు గ్రామాలకు వెళ్లే రహదారులను దిగ్బందిస్తామని కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. తక్షణమే ఈ సమస్యపై అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

# వేద పాఠశాల భూమి పూజకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం

**జయభేరి, హైదరాబాద్, మే 17 :**



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న వేద పాఠశాల భూమి పూజ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దేవాదాయ శాఖ అధికారులు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ తో పాటు ఆలయ అర్చకులు ఆదివారం ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లోని సీఎం క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి ప్రత్యేక ఆహ్వానం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట దేవస్థానం పరిధిలోని టెంపుల్ సిటీ ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీన వేద పాఠశాల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం శ్రీ కంచి పీఠాధిపతులు వారి దివ్య మంగళాశాసనాలతో వైభవంగా జరగనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ,భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో భవాని శంకర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా కోరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, శివాలయం ప్రధాన అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

- లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రామనర్సయ్య




**జయభేరి, దంతాలపల్లి, మే 16 :**

తొర్రూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రామ్ నరసయ్య ఆధ్వర్యంలో శనివారం దంతాలపల్లి మండల కేంద్రంలోని చిరు వ్యాపారులకు గొడుగులు,టోపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపరీతంగా ఎండలు కొడుతున్నందున చిరు వ్యాపారులు ఎండ తీవ్రతలు తట్టుకునేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగులు, టోపీలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక విద్యావేత్త సేను రాజేష్, రవీందర్ రెడ్డి,శ్రీనివాస్,కారం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# విద్యా వారోత్సవాలు చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు

**జయభేరి, దేవరకొండ :**

మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ దేవరకొండలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలు కార్యక్రమం చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో ముగిసింది. ఈ కార్యక్రమంలో నృత్య పోటీలు పాటల పోటీలు మిమిక్రీ వంటి హోటల్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు అలాగే ఇంటర్నేషనల్ లెవల్లో హ్యాండ్ బాల్ స్పోర్ట్స్ లో ఇంటర్నేషనల్ లెవెల్ లో పాల్గొన్న ఇస్లావత్ సంధ్య విద్యార్థిని సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మాట్లాడుతూ విద్యా వారోత్సవాల్లో భాగంగా వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రణాళిక ప్రకారం విజయవంతంగా పూర్తి చేసుకుని చివరి దశకు చేరుకున్నామని ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్ గా వ్యవహరించిన వైస్ ప్రిన్సిపల్ జి కోటయ్య చాలా చక్కగా అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తెలుగు సాంస్కృతిక విభాగ అధిపతి జి కోటయ్య, అకాడమీ కోఆర్డినేటర్ సి.లింగమయ్య కంట్రోలర్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ కె.పృథు, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. ప్రభాకర్, ఎ.శ్రీను తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ ఐదుగురిపైన కేసు నమోదు



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 17 :**

యాదగిరిగుట్ట పట్టణంలోని గుండ్లపల్లి దగ్గర ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురిపైన కేసు నమోదు చేసినట్లు యాదగిరిగుట్ట ట్రాఫిక్ సీఐ యలగొండ కృష్ణ తెలిపారు. తాగి వాహనాలు నడిపితే కచ్చితంగా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఐ యలగొండ కృష్ణతో పాటు ఎస్సైలు దేవేందర్, రాజు, కానిస్టేబుళ్లు కోటి, నితిన్, శ్రీనివాస్ రెడ్డి, సైదులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల్లో విద్యార్థిని అభినందించిన జిల్లా అడిషనల్ కలెక్టర్




**జయభేరి, తుర్కపల్లి, మే 17 :**

విద్యా వారోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తుర్కపల్లి మండలం మోడల్ స్కూల్ విద్యార్థిని జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు అభినందించారు. క్రీడారంగంలో జాతీయస్థాయి లో ఆడిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఏయమల అంజలి వాలీబాల్ స్కూల్ గేమ్స్ అండర్ 19 విభాగంలో జాతీయస్థాయిలో మధ్యప్రదేశ్ లో జరిగిన జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నది. తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలో చదువుతున్న ఇంటర్ సెకండియర్ సిఇసి చదువుతున్న వాసాలమర్రి విద్యార్థిని సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లె రమేష్ రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు.

# దత్తాయపల్లిలో జనగణన సర్వే



**జయభేరి, తుర్కపల్లి, మే 17:**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో శనివారం జనగణన సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కొనతం వెంకటరెడ్డి సూపర్వైజర్ గా శ్రీధర్ ఎన్యుమరేటరుగా జన గణన సర్వేను నిర్వహిస్తూ క్లస్టర్ పరిధిలోని సిఆర్పి వీరస్వామి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సర్వేలో భాగంగా ప్రవేట్ పాఠశాలలకు వెళుతున్నటువంటి విద్యార్థుల తల్లి దండ్రులను కలిపి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలు గురించి వివరిస్తూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విధంగా అవగాహన కల్పించారు

# కే కే నేతృత్వంలో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

- **కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొ. కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి**

**జయభేరి, హైదరాబాద్ :**



తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కేశవరావు నేతృత్వంలో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ తొలి సమావేశం. ఈ సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొ. కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు ప్రభుత్వం నుండి అధికారికంగా కమిటీ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమావేశంలో ధన్యవాదాలు తెలిపిన కమిటీ.

అమరవీరుల జ్యోతి కింద ఉన్న ఆఫీస్ లో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యాలయం ఏర్పాటు చేసేలా కమిటీలో నిర్ణయం. అమరవీరుల గుర్తింపు కోసం త్వరలో ఆల్ పార్టీ సమావేశం ఏర్పాటు చేసి వారి దగ్గర ప్రతిపాదనలు తీసుకోవాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ, 1969 ఉద్యమకారులు, ఉద్యోగ సంఘాలు, కళాకారుల జెఎసి, సబ్బండ వర్గాల జెఏసీ, కుల సంఘాల, న్యాయవాదులు జేఏసీ, వివిధ జిల్లాలో ఏర్పడిన ఉద్యమ సంఘాలు వారి నుండి ప్రతిపాదనలు తీసుకోవాలని నిర్ణయం. ఉద్యమకారుల కమిటీ జిల్లా పర్యటనలు చేసి విస్తృతంగా ప్రజల అభిప్రాయ సేకరణ చేయాలని నిర్ణయించింది.

**ఉద్యమకారులను గుర్తించడానికి నాలుగు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేసిన కమిటీ..**

1. **తెలంగాణ ఉద్యమంలో చనిపోయిన వారిని మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపాదన.**
2. **ఉద్యమంలో గాయపడిన వారికి రెండవ కేటగిరి గా తీసుకోవాలని ప్రతిపాదన.**
3. **తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లినవారు, అరెస్టులు అయిన వారు, తెలంగాణ ఉద్యమ కేసులు అయిన వారు మూడవ కేటగిరిగా తీసుకోవాలని ప్రతిపాదన.**
4. **రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి క్షేత్రస్థాయిలో ఉద్యమం చేసిన వారిని నాలుగవ కేటగిరి గా తీసుకోవాలని ప్రతిపాదించారు.**

నాలుగవ కేటగిరి గుర్తించడానికి వారు ఉద్యమంలో చేసిన పేపర్ కటింగ్స్ చూడాలని ప్రతిపాదన.. తెలంగాణ ఉద్యమంలో పౌరసమాజంలో ఉండి ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారి నుండి ప్రతిపాదనలు తీసుకోవాలి. 1969, 1972, 1996 ఉద్యమకారులతో సమావేశమై ప్రతిపాదనలు తీసుకోవాలని నిర్ణయం. తెలంగాణ ఉద్యమస్ఫూర్తిత్వాన్ని కాపాడేందుకు ఈ కమిటీ ఏర్పాటు చేసిందని రాజకీయాలకు అతీతంగా ఉద్యమకారుల ఎంపిక జరుగుతుందని తెలిపిన కమిటీ. గత ప్రభుత్వంలో కొంత మందికి మాత్రమే సహాయం అందించారని.. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా పార్టీలకు అతీతంగా ఎంపిక చేయాలని కమిటీ నిర్ణయం. ఉద్యమకారుల కమిటీ ప్రతిపాదించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ నుండి రాగానే కమిటీ ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపి కమిటీ ప్రతిపాదించిన అంశాలపై ముఖ్యమంత్రితో చర్చించాలని కమిటీ నిర్ణయం.



# ప్రధాని మోదీకి ఫైటర్ జెట్లతో ఎస్కార్ట్..

- **స్వీడన్‌లో ఎంట్రీ మామూలుగా లేదుగా..**

**జయభేరి, న్యూఢిల్లీ:**

నెదర్లాండ్ టూర్ తర్వాత స్వీడన్‌కి చేరుకున్నారు ప్రధాని మోదీ. మోదీ విమానానికి ఇరువైపులా ఫైటర్ జెట్స్ చక్కర్లు కొడుతూ గ్రాండ్‌గా వెల్‌కమ్ పలికాయి. రెండు దేశాల మధ్య ఉన్న బలమైన స్నేహ బంధానికి ఈ స్వాగతం ప్రతీకగా నిలిచింది. స్వీడిష్ ప్రధానితో ద్వైపాక్షిక చర్చలతో పాటు యూరోపియన్ బిజినెస్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ సమావేశంలో పాల్గొంటారు మోదీ. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వీడన్‌కి చేరుకున్నారు. గోథెన్‌బర్గ్‌లో ఆ దేశ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ మోదీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని మోదీ సైనిక వందనం స్వీకరించారు. అంతకుముందు మోదీ విమానం స్వీడన్ గగనతలంలోకి రాగానే స్వీడిష్ గ్రిపెన్ ఫైటర్ జెట్లు ఎస్కార్ట్‌గా నిలిచాయి. ఈ వీడియో నెట్టింట స్పెషల్ ఎట్రాక్షన్‌గా మారింది. స్వీడన్‌లో ప్రవాస భారతీయులు సైతం ప్రధాని మోదీకి ప్రత్యేక స్వాగతం పలికారు.. దీనికి సంబంధించిన వీడియో సైతం నెట్టింట వైరల్ గా మారింది.. ఈ టూర్‌లో ప్రధాని మోదీ స్వీడిష్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అలాగే యూరోపియన్ బిజినెస్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ సమావేశంలో పాల్గొంటారు. ఈ పర్యటనతో భారత్, యూరప్ మధ్య పెట్టుబడి సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ట్వీట్ లో ఆకాంక్షించారు మోదీ. 2018 తర్వాత మోదీకి ఇది మొదటి స్వీడన్ సందర్శన. భారత్‌కు డీప్ టెక్, రక్షణ, ఆవిష్కరణలు, గ్రీన్ ట్రాన్సిషన్ రంగాల్లో ఎన్నో అవకాశాలతో పాటు యూరప్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ అమలులోకి వచ్చిన సమయంలో ఈ టూర్ అత్యంత వ్యూహాత్మకం అంటున్నారు విశ్లేషకులు. మోదీ పర్యటన భారత ఆర్థిక వికాసం, స్వయం సమృద్ధి, గ్లోబల్ సప్లై చైన్ బలోపేతానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ చెబుతోంది.

మోదీ పర్యటన భారత్‌ను టెక్నాలజీ హబ్‌గా.. గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ డెస్టినేషన్‌గా మార్చడంలో సహాయపడుతుంది. రెసిలియంట్ సప్లయ్ చైన్స్, ఎనర్జీ సెక్యూరిటీ, స్టార్టప్‌లు, స్కిల్ డెవలప్‌మెంట్ లో భాగస్వామ్యం ఏర్పడుతుంది. వోల్వో, సాబ్ లాంటి కంపెనీలు ఇప్పటికే భారత్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాయి. ఇది ఉద్యోగాలు, ఎగుమతులు, ఆర్థిక వృద్ధిని పెంచనుంది. మోదీ నాయకత్వంలో భారత్ విదేశీ విధానం బలమైన భాగస్వామ్యాలు.. ఇన్నోవేషన్, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ పై దృష్టి సారిస్తోంది. స్వీడన్‌తో ఈ సహకారం దేశాన్ని వికసిత్ భారత్ 2047 లక్ష్యం వైపు ముందుకు నడిపిస్తుంది. ఈ పర్యటన భారత్ యూరప్‌లో ఎక్కువ ఇన్‌వెస్ట్‌మెంట్, టెక్ ట్రాన్స్‌ఫర్ ఆకర్షించనుంది. మోదీ గ్లోబల్ సౌత్ నాయకుడిగా.. ఇండో పసిఫిక్, యూరప్ మధ్య వారధిగా పనిచేస్తుంది.

**43ఏళ్ల తర్వాత భారత ప్రధాని నార్వే వెళ్లడం ఇదే తొలిసారి..**

నెక్స్ట్ మోదీ నార్వే పర్యటన అత్యంత విశేషంగా నిలవనుంది. 43ఏళ్ల తర్వాత భారత ప్రధాని నార్వే వెళ్లడం ఇదే తొలిసారి. 19న నార్వే రాజుతో పాటు ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. అదే సమయంలో ఓస్లోలో జరిగే 3వ భారత్ నార్డిక్ సమ్మిట్‌లో మోదీ పాల్గొంటారు. డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్లాండ్ ప్రధానులు ఈ సమ్మిట్‌కు హాజరవుతారు. మే 20న మోదీ ఇటలీ చేరుకుంటారు. ప్రధాని జార్జియా మెలోనితో కలిసి జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 202529 అమలుపై సమీక్ష నిర్వహిస్తారు. రక్షణ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఇటలీతో భారత్ సంబంధాలను పర్యటన మరింత పటిష్టం చేయనుంది. ఫైనల్‌గా ఐరోపా దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో ఈ పర్యటన భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.




# ఆదిలాబాద్ రిమ్స్‌లో కీచకపర్వం..

- **వైద్య విద్యార్థినిపై నర్సింగ్ ఆఫీసర్ అరాచకం!**

**జయభేరి, ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ (RIMS) లో దారుణం వెలుగుచూసింది. విధుల్లో ఉన్న ఒక వైద్య విద్యార్థినిపై ఓ నర్సింగ్ ఆఫీసర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా బయటకు వచ్చింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు అధికారికి అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో ఓ కీచకుడి బాగోతం బట్టబయలైంది. మహిళా వైద్య విద్యార్థులకు రక్షణగా ఉండాల్సిన ఓ నర్సింగ్ ఆఫీసర్ కామంతో కళ్లు మూసుకుపోయి దారుణానికి ఒడిగట్టాడు. ఓ అర్ధరాత్రి రిమ్స్ ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్ లో విధులు ముగించుకుని హాస్టల్ కు వెళ్లేందుకు సిద్ధమైన ఓ వైద్య విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆపరేషన్ థియేటర్ డోర్లు మూసివేసి ఆ జూనియర్ డాక్టర్ పై దారుణానికి యత్నించాడు. వెంటనే అలర్ట్ అయిన వైద్య విద్యార్థిని పెద్ద పెద్ద కేకలు వేస్తూ ఆ కామాంధుడి చెర నుండి బయటపడి ఆస్పత్రి బయటకు పరుగులు తీసింది. ఈ షాకింగ్ ఘటనతో ఆదిలాబాద్ రిమ్స్ వైద్య విద్యార్థి లోకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటన వారం రోజుల క్రితం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగు చూసింది. మే నెల 8వ తేదీన అర్ధరాత్రి ఓ వైద్య విద్యార్థిని రిమ్స్ ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్ లో విధులు ముగించుకుని హాస్టల్ కు వెళ్లేందుకు సిద్ధమైంది. ఇదే సమయంలో ఆ ఆపరేషన్ థియేటర్ రూంలో మేల్ స్టాఫ్ నర్స్ గా విధులు నిర్వహిస్తున్న కోటేవార్ సాయిరాం అనే నర్సింగ్ ఆఫీసర్ అసభ్యంగా ప్రవర్తించాడు. భోజనం చేస్తారంటూ మాటలు కలిపి తాకరాని చోట తాకేందుకు యత్నించాడు. ఈ హఠాత్తు పరిణామంతో షాక్ కు గురైన వైద్య విద్యార్థిని పెద్ద పెద్దగా కేకలు వేస్తూ బయటకు పరుగెత్తింది. ఆపరేషన్ థియేటర్ డోర్ పెట్టి ఆ వైద్య విద్యార్థిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు ఆ నర్సింగ్ ఆఫీసర్. ధైర్యంగా ఆ కామాంధుడిని తోసుకుంటూ ఆస్పత్రి జనరల్ వార్డ్ లోకి పరుగులు తీసింది ఆ వైద్య విద్యార్థిని. ఈ విషయం తెలుసుకున్న తోటి జూడాలు ఆ నర్సింగ్ ఆఫీసర్ పట్టుకునే ప్రయత్నం చేయగా ఆస్పత్రి నుండి పరారయ్యాడు. ఈ విషయాన్ని మరుసటి రోజు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జూడాల దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే అలర్ట్ అయిన డైరెక్టర్ ఏడుగురు సభ్యులతో విచారణ కమిటీని వేశారు. ప్రాథమిక విచారణలో ఘటన నిజమేనని తేలడంతో, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, క్షేత్రస్థాయిలో లోతైన విచారణ జరపాలని మహిళా శిశు సంక్షేమ శాఖను ఆదేశించారు. మరో వైపు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తగా వ్యవహరించారు. ఈ సంఘటనను కలెక్టర్ రాజర్షి షా దృష్టికి తీసుకెళ్లడంతో క్షేత్రస్థాయిలో లోతైన విచారణ చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. ఈనెల 10వ తేదీన విచారణ చేపట్టిన డీడబ్ల్యూఓ అదికారిని నర్సింగ్ ఆఫీసర్ వైద్య విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పట్టుగా తేల్చారు. రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు సాయిరాంను ఈ నెల 13వ తేదీన అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. అయితే విషయం కాస్త బయటకు పొక్కడంతో రిమ్స్ లో కీచక పర్వం వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. అటు వైద్య విద్యార్థినుల్లో వారి కుటుంబ సభ్యుల్లో ఆందోళనకు కారణమైంది. జూడాలకే రక్షణ లేకుంటే ఇక మా పరిస్థితి ఏంటని రిమ్స్ లోని కింది స్థాయి సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ భద్రత చర్యలు తీసుకోవాలని జూనియర్ వైద్యుల సంఘం నాయకులు, వైద్య విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమని.. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపడుతామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. గతంలో వైద్య విద్యార్థుల రీల్స్ వ్యవహారం సంచలనం సృష్టించగా.. తాజాగా వైద్య విద్యార్థినిపై లైంగిక వేదింపుల ఘటనతో రిమ్స్ లో అసలు ఏం జరుగుతుంది అన్న చర్చ తెర పైకి వచ్చింది. అయితే ఈ ఘటన సున్నితమైనది కావడంతోనే జిల్లా యంత్రాంగం చాలా జాగ్రత్తగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. నిందితుడి వివరాలు సైతం గోప్యంగా ఉంచింది. నిందితుడిపై బీఎన్ఎస్ 75, 78, 127(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు.

# తెలంగాణ బాగుపడాలంటే.. మళ్లీ గులాబీ జెండా ఎగరాల్సిందే!

**జయభేరి, ఎల్బీనగర్ :**



జి.ఎస్.ఆర్ కన్వెన్షన్ హాలు జరిగిన నా బూత్ నా భవిష్యతు ఎల్బీ నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఎన్నికల సంఘం చేపట్టిన “స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)” కార్యక్రమంపై లోతైన చర్చ జరిపి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక అంశమని పేర్కొన్నారు. నగరంలో ఎక్కడా దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు ఉండకుండా ప్రతి బూత్ స్థాయిలో పర్యవేక్షణను బలోపేతం చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్ర స్థాయిలో కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, సవరణలు వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని, యువత, మహిళలు మరియు కొత్తగా అర్హత పొందిన వారిని ప్రత్యేకంగా గుర్తించి నమోదు చేయించాలన్నారు. ఈ దిశగా పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రపూరితంగా మన ఓటర్ల ఓట్లను తొలగించకుండా క్షేత్రస్థాయిలో జాగ్రత్త వహించాలి. పదేళ్లపాటు తెలంగాణలో కులం పేరిట, మతం పేరిట మేము ఎన్నడూ చిల్లర రాజకీయాలు చేయలేదు. గంగాజమునా తెహజీబ్ సంస్కృతిలా అందరినీ కడుపులో పెట్టుకుని చూసుకున్నాం. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెద్దుల మాదిరిగా ముందుకు నడిపించాం. కానీ ఇవాళ మన మధ్య విద్వేషాలు రగిలిస్తూ కొందరు చేస్తున్న చిల్లర రాజకీయాలను మనమంతా ఏకమై తిప్పికొట్టాలి. భవిష్యత్తులో హైదరాబాద్, తెలంగాణ బాగుపడాలంటే.. మళ్లీ గులాబీ జెండా ఎగరాల్సిందే! అర్హులైన ప్రజల ఓటు హక్కును కాపాడటంలో ప్రతి బూత్ స్థాయిలో 'బూత్ లెవెల్ అసిస్టెంట్లు' (BLAs) కీలకంగా వ్యవహరించాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్నది కూల్చివేతలే బేటీ బచావో.. బేటీ పఢావో అని ప్రధానమంత్రి మోడీ అంటున్నాడు, ఇలా కేవలం నినాదాలకే పరిమితమైతే.. న్యాయం జరగదు మోదీ.. నిష్పాక్షిక విచారణ కోసం బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి. ఇలాంటి వ్యక్తులు పదవుల్లో కొనసాగడం అది తెలంగాణకే కాదు, భారతదేశానికి కూడా అవమానకరం. నగరంలో కనీసం తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి అంశాలను కూడా నిర్వహించలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నది. ఈ కార్యక్రమంలో వారితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సరస్వతి నది అంత్య పుష్కరాల మహోత్సవం

**జయభేరి, హైదరాబాద్ :**



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పవిత్ర త్రివేణీ సంగమ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం వద్ద, ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు అత్యంత వైభవంగా జరగనున్న “సరస్వతి నది అంత్య పుష్కరాల” మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ అర్చక బృందం, ఉన్నతాధికారులు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం, స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీలు వేంనరేంధేర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు గారు, దేవస్థానం ఈవో మహేష్ పాల్గొన్నారు.


# విద్యార్థుల విజయాలతోనే భవిష్యత్‌కు బలమైన బాట

**జయభేరి, వరంగల్ :**

తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన “విద్యా విజయోత్సవాలు 2025, 26” కార్యక్రమం ఘనంగా జరిగింది. 2025, 26 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థి విద్యార్థినీలను సన్మానిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా, KUDA చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి విద్యార్థులను అభినందించి సత్కరించారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే నాగరాజు గారికి అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు శాలువాలు కప్పి అభినందన పత్రాలు, క్యాష్ ప్రైజులు అందజేశారు. అలాగే వరంగల్ కృష్ణకాలనీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థికి లక్ష రూపాయల చెక్కును అందజేసి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.... తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థుల విజయం వెనుక తల్లిదండ్రుల త్యాగం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్‌లో డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు, ప్రజాసేవకులుగా ఎదిగి తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో విశ్వాసం మరింత బలపడుతుందని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు.

# గుప్త నిధులు ఉన్నాయంటూ కేటుగాళ్ల దొంగ పూజలు..

- **పోలీసుల ఎంట్రీతో సీన్ రివర్స్!**




**జయభేరి, చెన్నూర్, మే 17:**

కొందరు కేటుగాళ్లు అమాయకులను టార్గెట్ చేసి భారీగా ఆశలు చూపి మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం రచ్చపెల్లి గ్రామంలోని ఓ ప్రాంతంలో నిధుల కోసం కొందరు వ్యక్తులు రహస్యంగా పూజలు నిర్వహిస్తుండగా స్థానికులు గమనించారు. వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారయ్యారు. వివరాల్లోకి వెళితే మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం రచ్చపల్లి గ్రామ శివారులో గుప్తనిధుల పేరిట పూజలు, తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. రచ్చపల్లి గ్రామ సమీపంలోని వ్యసాయ భూమిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రి సంఘటనా స్థలానికి వెళ్లగా.. పోలీసులను చూసి వారు పారిపోయారు. అక్కడ పూజా వస్తువులు, ఇతర సామగ్రి లభించాయి. రెవెన్యూ అధికారుల ద్వారా ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. రచ్చపల్లికి చెందిన జక్కుల కుమార్ తన భూమిలో గుప్తనిధులు వెలికి తీసేందుకు స్థానికుడైన మరాఠీ స్వామితో పాటు చెన్నూరు, భీమారం మండలాల్లోని చాకేపల్లి, పొన్నారం, ఆరెపల్లి, మద్దికల్ గ్రామాలకు చెందిన సోదరి రాజసమ్మయ్య, కస్తూరి భూమయ్య, రాజేష్, జాడి నర్సయ్య, తిప్పర్తి రమేష్లను పురమాయించాడు. వారంతా కలిసి తవ్వకాలు జరిపేందుకు సిద్ధమైనట్లు తమ విచారణలో తేలిందన్నారు. జక్కుల కుమార్, మరాఠీ స్వామి పరారీలో ఉండగా.. మిగతా అయిదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు.



# నా ఫస్ట్ క్రష్ అతడే..


గ్లామర్ ఫీల్డ్‌లో హీరోయిన్ల వ్యక్తిగత జీవితాలు, వారి ప్రేమాయణాలు, రిలేషన్‌షిప్స్ గురించి ఎప్పుడూ ఏదో ఒక చర్చ నడుస్తూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్లు సీరియస్ రిలేషన్‌షిప్‌లలో ఎందుకు ఉండలేరు అనే విషయంపై కాజల్ అగర్వాల్ ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సాధారణంగా చాలామంది హీరోయిన్లు తమకు క్రషెస్ ఉన్నాయని చెబుతారు కానీ, ఎలాంటి సీరియస్ రిలేషన్ షిప్‌లో లేమని, బాయ్‌ఫ్రెండ్స్ ఎవరూ లేరని అంటుంటారు. దీనిపై మీ అభిప్రాయం ఏంటి?" అని యాంకర్ అడిగారు. "ఇది ఒక్కొక్కరి వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. కానీ ఒక హీరోయిన్‌గా నాకూ ఆ పరిస్థితి ఏంటో అర్థమవుతుంది. హీరోయిన్లు ప్రస్తుతం ఎలాంటి సీరియస్ రిలేషన్‌షిప్‌లలో ఉండకపోవడానికి గల ప్రధాన కారణం సమయం లేకపోవడమే. అసలు సమయం దొరకదు. నిరంతరం షూటింగ్‌లు, ప్రయాణాలు, ప్రమోషన్లతో లైఫ్ చాలా బిజీగా సాగుతుంది. అలాంటి షెడ్యూల్స్ మధ్య ఒక బంధానికి ఇవ్వాల్సిన సమయాన్ని కేటాయించడం చాలా కష్టం" అని కాజల్ స్పష్టం చేశారు. తన వ్యక్తిగత జీవితంలో ఉన్న క్రషెస్ గురించి కూడా కాజల్ సరదాగా ఓపెన్ అయ్యారు. "నాకు కూడా క్రషెస్ ఉన్నాయి. నిజం చెప్పాలంటే, ఎదుగుతున్న వయసులో క్రషెస్ ఉండటం చాలా సహజమైన విషయం. నా కాలేజీ రోజుల్లో నాకు కూడా క్రషెస్ ఉండేవి. అయితే వారంతా ఇప్పటికీ నాకు చాలా మంచి స్నేహితులుగా కొనసాగుతున్నారు" అని నవ్వుతూ చెప్పారు. కాలేజీలో తనకు క్రష్ ఉందని... ఇప్పటికీ తను స్నేహితుడిగా ఉన్నాడని చెప్పుకొచ్చింది.



## వెంకటేశ్ – త్రివిక్రమ్ సినిమాలో స్పెషల్ సర్‌ప్రైజ్..
# పాత హిట్ పాటకు రీమిక్స్ ప్లాన్!

టాలీవుడ్‌లో ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్రేజీ కాంబినేషన్లలో హీరో వెంకటేష్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ కూడా ఒకటి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ కథా నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో వినోదంతో పాటు భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు కూడా ప్రధాన ఆకర్షణగా ఉండనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో ప్రేక్షకులకు ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇవ్వడానికి చిత్రబృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ గతంలో నటించిన ఓ హిట్ సినిమాలోని పాపులర్ పాటను కొత్తగా రీమిక్స్ చేసి ఈ సినిమాలో ఉపయోగించే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఏ పాటను ఎంపిక చేశారన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. సాధారణంగా త్రివిక్రమ్ తన సినిమాల్లో సంగీతం, సంభాషణలు, వినోదం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ముఖ్యంగా పాత క్లాసిక్ అంశాలను కొత్త తరానికి తగ్గట్టుగా అందించడంలో ఆయనకు ప్రత్యేక శైలి ఉంది. దీంతో వెంకటేశ్ పాత సినిమా పాటను కొత్తగా ఎలా చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. ఇక ఈ సినిమా కేవలం కుటుంబ కథతో మాత్రమే కాకుండా పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందనున్నట్లు తెలుస్తోంది. యాక్షన్ సన్నివేశాలతో పాటు ప్రేక్షకులను నవ్వించే కామెడీ ట్రాక్ కూడా కీలకంగా ఉండబోతున్నట్లు సమాచారం. ముఖ్యంగా వెంకటేశ్ కామెడీ టైమింగ్‌కు త్రివిక్రమ్ రచన జతకావడంతో మరోసారి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రూపుదిద్దుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. త్రివిక్రమ్ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రీప్రొడక్షన్ నుంచి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం షూటింగ్ పూర్తి చేసి వేసవి సీజన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. కాగా, వెంకటేశ్ - త్రివిక్రమ్ అనుబంధం కొత్తది కాదు. గతంలో నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి వంటి చిత్రాలకు త్రివిక్రమ్ రచయితగా పని చేశారు. ఆ సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు చాలా సంవత్సరాల తర్వాత వీరిద్దరూ నేరుగా హీరో - దర్శకుడిగా కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# మే 21 ముహూర్తం గెట్ రెడీ



బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత.. మళ్లీ దర్శకుడు కేవీఎస్ రవీంద్ర(బాబీ)తో మెగాస్టార్ చిరంజీవి సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ఈ నెల 21న ఘనంగా పూజా కార్యక్రమాలతో మొదలు కానుంది. ఈ విషయాన్ని స్వయంగా చిరంజీవే తన పవర్‌ఫుల్ జిమ్ వీడియో ద్వారా రివీల్ చేశారు. ఆ వీడియోలో ఆయన చూపించిన డెడికేషన్, ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం ఆయన చేస్తున్న ఇంటెన్స్ వర్కవుట్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. 'గెట్టింగ్ రెడీ ఫర్ 158..బాబీ.. మే 21 ముహూర్తం.. కేవీఎన్ ప్రొడక్షన్స్ వారిది.. అంటే ఇంకో నాలుగైదు రోజుల్లో కలుస్తున్నాం.. గెట్ రెడీ' అంటూ ఈ వీడియోలో మెగాస్టార్ మాట్లాడారు. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్, లుక్ టెస్ట్ ఫొటో సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. తాజాగా ఈ వీడియో అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో ఓ స్థాయిలో వైరల్ అవుతున్నది.



# ఏకంగా రూ.1,491 కోట్ల గౌను..

బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా అంతర్జాతీయ వేదికలపై తన ఫ్యాషన్ సెన్స్‌తో ఎప్పుడూ సంచలనం సృష్టిస్తూనే ఉంటుంది. తాజాగా కేన్స్ 2026 రెడ్ కార్పెట్‌పై ఆమె సృష్టించిన విజువల్ వండర్ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకలో ఊర్వశి ధరించిన లుక్ విలువ సుమారుగా 155.87 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ. 1,491 కోట్లు అన్నమాట. ఫ్యాషన్ మీడియా దీనిని కేన్స్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన లుక్‌గా అభివర్ణిస్తోంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, కేన్స్ 2025లోనూ ఊర్వశి దాదాపు ఇంతే విలువైన $155.86 మిలియన్లు అంటే రూ. 1,294 కోట్ల విలువైన మైఖేల్ సింకో గౌనుతో మెరిసింది. అప్పట్లో కిమ్ కర్దాషియాన్ మార్లిన్ మన్రో ఐకానిక్ డ్రెస్ – 4.8 మిలియన్ డాలర్ల రికార్డును అధిగమించిన ఊర్వశి, ఈ ఏడాది తన సొంత రికార్డును తానే బ్రేక్ చేస్తూ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఏదేమైనా, ఈ భారీ విలువలపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ, ఊర్వశి రౌతేలా మాత్రం గ్లోబల్ ఫ్యాషన్ ఐకాన్‌గా మరోసారి వార్తల్లో నిలిచింది.

# వృషకర్మ మూవీ బిటిఎస్ స్టిల్స్ రిలీజ్



తండేల్ బ్లాక్ బస్టర్ విజయంతో అద్భుతంగా సాగుతున్న యువ సామ్రాట్ నాగ చైతన్య, తన తొలి బ్లాక్‌బస్టర్ 'విరూపాక్ష'తో ఆకట్టుకున్న ఫిల్మ్ మేకర్ కార్తీక్ దండుతో కలిసి ప్రతిష్ఠాత్మక మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' చేస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్‌వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ అద్భుతమైన రెస్పాన్స్‌తో 20 మిలియన్ వ్యూస్ దాటి దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొల్పింది. ప్రస్తుతం 'వృషకర్మ' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. తాజాగా రాజస్తాన్‌లో జరిగిన భారీ షెడ్యూల్‌కు సంబంధించిన బిహైండ్ ది సీన్స్ స్టిల్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. రాజభవనాలు, పురాతన శిల్పకళతో అలరారుతున్న లొకేషన్స్‌లో చిత్రీకరించిన కీలక సన్నివేశాలు సినిమాకి ఉన్న భారీ విజువల్ స్కేల్‌ను చూపిస్తున్నాయి. ప్రధాన నటీనటులంతా పాల్గొన్న ఈ షెడ్యూల్ కథలో కీలకంగా ఉండబోతుంది. ఈ స్టిల్స్ ద్వారా సినిమాకి ఉన్న మిస్టిక్ టోన్, గ్రాండియర్ మరింత స్పష్టమవుతోంది. షూటింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. భారీ స్థాయిలో CGI, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగిస్తూ భారతీయ ప్రేక్షకులకు ఎప్పుడూ చూడని సినీ అనుభూతిని అందించేందుకు టీమ్ పని చేస్తోంది. మిస్టికల్ ఎలిమెంట్స్‌ను రిచ్ స్టోరీటెల్లింగ్‌తో, ఇమర్సివ్ వరల్డ్ బిల్డింగ్‌తో అద్భుతంగా తెరపై ఆవిష్కరించబోతున్నారు. 'వృషకర్మ' చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. సినిమాటోగ్రాఫర్ రాగుల్ డీ హెరియన్ అద్భుతమైన విజువల్ స్టైల్‌ను అందిస్తుండగా, అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ శ్రీ నాగేంద్ర తంగాల ఈ చిత్రంలోని మిస్టిక్ ప్రపంచాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. నవీన్ నూలి ఎడిటర్. పవర్‌ఫుల్ కాంబినేషన్, భారీ సాంకేతిక ప్రమాణాలు, మైథలాజికల్ టచ్‌తో రూపొందుతున్న 'వృషకర్మ' స్కేల్, మిస్టరీ, సినిమాటిక్ గ్రాండియర్ కలయికగా నిలవబోతోంది. మరిన్ని ఎక్సైటింగ్ అప్‌డేట్‌లు త్వరలో మేకర్స్ నుంచి రాబోతున్నాయి. తారాగణం: నాగ చైతన్య, మీనాక్షి చౌదరి, స్పర్శ్ శ్రీవాస్తవ, జయరామ్, సత్య.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**